# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ ఆదివారం 02 నవంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## వరద నష్టం వివరాలు పంపండి

- కలెక్టర్లకు సీఎస్ రామకృష్ణారావు ఆదేశం




**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

మొంథా తుపాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుపాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో శనివారం హైదరాబాద్‌లోని బీఆర్.అంబేద్కర్ సచివాలయం నుంచి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 24 జిల్లాలు తుపాన్‌కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాల్లో జరిగిన పంటలు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. ఇటీవలి కాలంలో రాష్ట్రంలో 25 నుంచి 30 సెంటీమీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందనీ, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికలను

మిగితా 4వ పేజీలో

## జూబ్లిహిల్స్‌ను అభివృద్ధి చేసే బాధ్యత నాది

- నవీన్ యాదవ్‌ను 30వేల మెజార్టీతో గెలిపించండి
- అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహం
- బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు
- బోరబండ కార్నర్ మీటింగ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బోరబండ చౌరస్తాకు పీజేఆర్ పేరు పెట్టాలని అడుగుతున్నారనీ, నవీన్‌యాదవ్ విజయయాత్రకు మళ్లీ వచ్చి ఈ చౌరస్తాకు పీజేఆర్ చౌరస్తాగా పేరు పెట్టుకుందామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌కు ఒక్క అవకాశం ఇచ్చి నవీన్ యాదవ్‌కు ఓటేసి గెలిపిస్తే జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానని హామీనిచ్చారు.శనివారం రాత్రి బోరబండలో జరిగిన కార్నర్ మీటింగ్‌లో సీఎం మాట్లాడారు. గత ఎన్నికల్లో అజారుద్దీన్‌ను గెలిపిస్తే మంత్రిని చేస్తామని మాట ఇచ్చామనీ, జూబ్లీహిల్స్ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇచ్చి మీ ముందుకు తీసుకొచ్చా అన్నారు. కారు షెడ్డుకు పోయిందనీ, బిల్లా రంగాలు ఆటోల్లో తిరిగి మిమ్మల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారన్నారు. ఇవాళ కొత్తగా జూబ్లీహిల్స్‌లో సమస్యలు వచ్చినట్టు మాట్లాడుతున్నారనీ, సెంటిమెంట్ పేరుతో ఓట్లు దండుకోవడానికి వస్తున్నారన్నారు. 2007లో పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవం చేయాలంటే అభ్యర్థిని పెట్టి ఎన్నికలు తెచ్చిన దుర్మార్గుడు కేసీఆర్ అన్నారు. పేదలను ఆదుకున్న చరిత్ర పీజేఆర్‌ది అనీ, ఇక్కడి బస్తీల్లో ఏ తలుపు తట్టినా పీజేఆర్ సాయం పొందినవారే ఉంటారని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సమస్యలను ఎందుకు పరిష్కరించలేదని ప్రశ్నించారు. ఇప్పుడొచ్చి సమస్యలను పరిష్కరిస్తామని కల్లబొల్లి మాటలు చెప్తే ఇక్కడి జనం నమ్మరన్నారు. అందరికీ రేషన్ కార్డులు ఇచ్చామనీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, పేదలందరికీ సన్నబియ్యం. ఆడబిడ్డలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నామని తెలిపారు. ఉచిత బస్సు సౌకర్యాన్ని రద్దు చేయాలని బీఆరెసోళ్లుమాట్లాడుతున్నారనీ, ఇదీ వాళ్ల గలీజ్ బుద్ధి అన్నారు. 2014 నుంచి ఒక్క ఆడబిడ్డకూ మంత్రి పదవి ఇవ్వలేదనీ, తమ ప్రభుత్వంలో సీతక్క, కొండా సురేఖకు మంత్రి పదవులు ఇచ్చామని చెప్పారు. శిల్పారామం దగ్గర మహిళా స్వయం సహాయక సంఘాల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం స్టాల్స్ ఇచ్చామని తెలిపారు. మున్సిపల్ మంత్రిగా ఉండి కూడా కేటీఆర్ జూబ్లీహిల్స్ సమస్యలను పరిష్కరించ లేదన్నారు. ఈ నియోజకవర్గం నుంచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి ఎందుకు నిధులు తీసుకురాలేదనీ, బోరబండకు వచ్చి ఎందుకు సమస్యలు పరిష్కరించలేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆరెస్‌ది ఫెవికాల్ బంధం అన్నారు. ఆస్తిలో వాటా ఇవ్వాల్సి వస్తుందని సొంత చెల్లెలిని ఇంటి నుంచి పంపిన కేటీఆర్.. సునీతమ్మను మంచిగా చూసుకుంటాడా అని అన్నారు. నవీన్‌ను గెలిపిస్తే ఈ ప్రాంతంలో ఉన్న అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే బాధ్యత తీసుకుంటాడని తెలిపారు. నవీన్‌ను 30 వేల ఓట్ల మెజారిటీతో గెలిపించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ లోపయికారి ఒప్పందం చేసుకోవడంతోనే బీజేపీకి 8 ఎంపీ సీట్లు వచ్చాయన్నారు. తాడు బొంగరం లేని బీజేపీ జూబ్లీహిల్స్‌లో అభివృద్ధి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం ఎర్రగడ్డ డివిజన్‌లోని సుల్తాన్‌నగర్ హనుమాన్ ఆలయం నుంచి జనప్రియ వరకు సీఎం రోడ్డు షో నిర్వహించారు.

## కాశీబుగ్గ ఆలయంలో ఘోర విషాదం

- తొక్కిసలాటలో 9 మంది మృతి
- మృతుల్లో ఎనిమిది మంది మహిళలు, ఒక బాలుడు
- ప్రధాని, సీఎం, ప్రముఖ నేతల దిగ్భ్రాంతి



**బలగం టీవి, అమరావతి**

శ్రీకాకుళం జిల్లా పలాస-కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం విషాదం చోటుచేసుకుంది. ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 9 మంది మృతి చెందగా, 16 మంది గాయపడ్డారు. మృతుల్లో 8 మంది మహిళలు, 13 ఏళ్ల బాలుడు ఉన్నారు. వారిలో ఏడుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, ఇద్దరు ఆస్పత్రిలో మృతి చెందారు.

కార్తీక ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 15 వేల మందికిపైగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ఒకే మెట్ల మార్గం ఉండడంతో భక్తులు తోపులాటకు దిగారు. ఈ క్రమంలో రైలింగ్ విరగడంతో భక్తులు కింద పడిపోయి, పై నుంచి మరో వరుసగా ఉన్నవారు పడటంతో తొక్కిసలాట జరిగింది. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండగా, పలువురికి పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతదేహాలను శవపంచనామా అనంతరం బంధువులకు అప్పగించారు.

భక్తుల సంఖ్యకు తగ్గ ఏర్పాట్లు లేకపోవడం వల్లే ఈ దుర్ఘటన జరిగిందని యాత్రికులు ఆరోపించారు. విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్‌జెట్టి, మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పి కె.వి. మహేశ్వరరెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు.

**ప్రధాని, సిఎం, గవర్నర్ స్పందన**

ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు, కేంద్రం రూ.2 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాయి. గాయపడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షలు, కేంద్రం రూ.50 వేల పరిహారం ప్రకటించింది.

**విచారణ ఆదేశాలు**

జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించి, టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, ఏఎస్‌పి కె.వి.రమణ, దేవాదాయశాఖ సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్ నేతృత్వంలో కమిటీని నియమించారు.

ఈ ఘటనపై మంత్రి లోకేష్ మాట్లాడుతూ, గుడి నిర్మాణ లోపాలు, నిర్వాహకుల వైఫల్యమే ఈ ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు అదనంగా రూ.10,000 తక్షణ సాయం, టీడీపీ తరఫున రూ.5 లక్షల సహాయం అందజేస్తామని తెలిపారు.మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, "ప్రభుత్వ నిర్లక్ష్యం ప్రజల ప్రాణాలను తీస్తోంది" అని విమర్శించారు. సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు కూడా ప్రభుత్వ వైఫల్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

మృతులు

ఈదురి చిన్నమ్మ (50) – రామేశ్వరం, టెక్కలి, రాపాక విజయ (48) – పిట్టలసారి, టెక్కలి, మురిపింటి నీలమ్మ (60) దుక్కవానిపేట, వజ్రపుకొత్తూరు, దువ్వు రాజేశ్వరి (60) బెల్లుపట్టియా, మందస రూప (40)–గుడ్డుభద్ర, బృందావతి (62) – మందస చిన్ని యశోదమ్మ (56) – శివరాపురం, నందిగాం లోట్ల నిఖిల్ (13) %–% బెంకిలి, సోంపేటడొక్కర అమ్ముడమ్మ (50) – పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ

"ఇంతమంది వస్తారని ఊహించలేదు. సాధారణంగా మూడు నుంచి ఐదు వేల మంది వస్తుంటారు. ఒక్కసారిగా భారీగా రావడంతో పరిస్థితి అదుపు తప్పింది." అని ఆలయ ధర్మకర్త హరిముకుంద పండా తెలిపారు.

## మన సీట్లు మనకే...

- మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు 85 శాతం రిజర్వేషన్లకు ఓకే
- ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ..
- ఇకపై 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే ఇవ్వనున్న సర్కార్
- హెల్త్ మినిస్టర్ విజ్ఞప్తికి స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో పీజీ వైద్య విద్య విద్యార్థులకు గత పదేళ్లుగా జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం స్పందించింది. మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు 85 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. ఇప్పటివరకూ మేనేజ్‌మెంట్ కోటా సీట్లన్నీ ఆల్ ఇండియా కేటగిరీలో భర్తీ అవుతూ వస్తుండగా.. ఇకపై 85 శాతం సీట్లు తెలంగాణ బిడ్డలకే దక్కనున్నాయి. ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ విజ్ఞప్తి మేరకు సీఎం రేవంత్ రెడ్డి మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు లోకల్ విద్యార్థులకు కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో పీజీ కోసం ఎంబీబీఎస్ విద్యార్థులు పడుతున్న కష్టాలపై ప్రభుత్వం సరైన సమయంలో నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహకు జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. వైద్య విద్యపై ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇది నిదర్శనమని పీసీసీ డాక్టర్స్ సెల్ చైర్మన్ డా. రాజీవ్ పేర్కొన్నారు. ఇకపై మేనేజ్ మెంట్ కోటా సీట్లలో సింహభాగం మనకే దక్కుతాయని... ఇదెంతో శుభపరిణామమని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయంతో రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య మరింతగా పెరగనున్నది. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో తోడ్పడుతుంది.

**పదేళ్లుగా అన్యాయం...**

మెడికల్ పీజీ స్టేట్ కోటా మేనేజ్మెంట్ సీట్ల భర్తీలో రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి తెలంగాణ విద్యార్థులకు అన్యాయం జరుగుతూ వచ్చింది. 25శాతంగా ఉన్న మేనేజ్ మెంట్ కోటా–1 సీట్లలో తెలంగాణలో మాత్రం 100శాతం ఆల్ ఇండియా కోటాగా చూపిస్తూ వస్తే ఏపీలో మాత్రం ఇదే కోటాను 85శాతం స్థానికులకే రిజర్వ్ చేశారు. తెలంగాణలోనూ 25శాతంగా ఉన్న మేనేజ్ మెంట్ కోటా–1 సీట్లలో తెలంగాణలోనూ 85 శాతం లోకల్ క్యాండిడేట్స్‌కే కేటాయించాలని రాష్ట్రానికి చెందిన వైద్య విద్యార్థులు, వారి తల్లితండ్రులు, వైద్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వచ్చారు. పదేళ్లు అధికారంలో ఉన్న గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు. గత ఏడాది వరకు కూడా ప్రభుత్వం పాత విధానంలోనే సీట్లను కేటాయించింది. స్థానిక కోటా లేకపోవడంపై మన వైద్య విద్యార్థులు తీవ్రమైన అసంతృప్తి వ్యక్తం చేస్తూ వచ్చారు. ఏపీలో ఇస్తున్నప్పుడు మనమెందుకు మనను అన్యాయం చేసుకునుడు అని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకున్న వైద్య మంత్రి దామోదర్ రాజనర్సింహ... ఈ అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి విషయాన్ని తీసుకుపోయారు. మంత్రి విజ్ఞప్తికి స్పందించిన సీఎం వెంటనే ఉత్తర్వులు వచ్చేలా చేశారు. దీంతో ఇన్నాళ్లపాటు మన విద్యార్థులకు జరుగుతూ వచ్చిన అన్యాయానికి ఫుల్ స్టాప్ పడింది.

మిగితా 4వ పేజీలో

## కెనడా వ్యాపారవేత్తలు పెట్టుబడులతో రావాలి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. తెలంగాణ–కెనడా సంబంధాలను మరింత బలపరిచే దిశగా ఈ భేటీ కొనసాగింది. ప్రధానంగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఫార్మాస్యూటికల్స్, ఏరోస్పేస్, రక్షణ రంగం, పట్టణ మౌలిక సదుపాయాల వంటి కీలక రంగాల్లో కెనడా భాగస్వామ్యాన్ని విస్తరించే అంశాలపై చర్చించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల గురించి కెనడా హైకమిషనర్ బృందానికి వివరించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా తెలంగాణలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందని పేర్కొంటూ, కెనడా వ్యాపారవేత్తలు పెట్టుబడులతో ముందుకు రావాలన్నారు. పారిశ్రామిక రంగాలతో పాటు స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, అధునాతన సాంకేతిక కేంద్రాల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి జూబ్లీహిల్స్ నివాసంలో జరిగిన ఈ సమావేశంలో క్రిస్టోఫర్ కూటర్ సతీమణి కరెన్, కెనడా మంత్రి ఎడ్ జాగర్, ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఫ్రెంచ్ కార్యాలయాన్ని బలోపేతం చేయండి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ నేతృత్వంలోని ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ సంస్థల సహకారంతో అమలవుతున్న ప్రాజెక్టులపై ఈ సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలంగాణలో పెట్టుబడులను విస్తరించాలని ఫ్రెంచ్ ప్రతినిధి బృందాన్ని ఆహ్వానించారు. హైదరాబాద్ నగరంలోని ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని బలోపేతం చేయడం ద్వారా ఇరుపక్షాల మధ్య మరింత సన్నిహిత సహకారం కొనసాగించవచ్చని సూచించారు.

సమావేశంలో అలయన్స్ ఫ్రాన్స్ హైదరాబాద్ డైరెక్టర్ శ్రీమతి మౌద్ మిక్వా గారు, ఫ్రెంచ్ బ్యూరో అసిస్టెంట్ శ్రీమతి రోహిణి రెడ్డిపల్లి గారు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్



- 6న హైదరాబాద్‌లో లక్ష మంది సిబ్బందితో సమావేశం
- 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో సభ
- ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రూ.900 కోట్లు విడుదల చేయాలి
- ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య చైర్మెన్ రమేష్‌బాబు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల కోసం ప్రయివేటు కాలేజీ యాజమాన్యాలు సోమవారం నుంచి నిరవధిక బంద్ చేపట్టాలని నిర్ణయించాయి. ఈనెల ఆరో తేదీన హైదరాబాద్‌లో లక్ష నుంచి లక్షన్నర మంది అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహిస్తామని ప్రకటించాయి. ఈనెల 10 లేదా 11న పది లక్షల మంది విద్యార్థులతో సభను నిర్వహిస్తామని తెలిపాయి. శనివారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య (ఫతి) చైర్మెన్ నిమ్మటూరి రమేష్‌బాబు మాట్లాడుతూ ఫీజు బకాయిల్లో టోకెన్లు ఇచ్చిన నిధులు రూ.1,200 కోట్ల వరకు ఉన్నాయని వివరించారు. దసరా నాటికి రూ.600 కోట్లు, మిగిలిన రూ.600 కోట్లు దీపావళి నాటికి ఇస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. కానీ ఇప్పటి వరకు 300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. మిగిలిన రూ.900 కోట్లు ఆదివారం నాటికి విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని అడిగితే విజిలెన్స్ తనిఖీలు చేపడతామంటూ బెదిరింపు ధోరణులకు దిగడం సరైంది కాదన్నారు. కాలేజీ యాజమాన్యాలను భయభ్రాంతులకు గురిచేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం తరహాలోనే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని అన్నారు. కేసీఆర్ సలహాలు పాటిస్తున్నారా?అని రేవంత్‌రెడ్డిని ప్రశ్నించారు. భయభ్రాంతులకు గురిచేసినా తాము బెదిరేది లేదని స్పష్టం చేశారు. ఫీజు బకాయిలను విడుదల చేయాలంటూ రాష్ట్రంలోని ఇంజినీరింగ్, ఫార్మసీ,

మిగితా 4వ పేజీలో

## గుర్తుతెలియని మహిళ దారుణ హత్య

**బలగం టీవి, నిజామాబాద్**

గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా నవీపేట్ మండలం మిట్టాపూర్ శివారులో చోటుచేసుకుంది. శనివారం ఉదయం మిట్టాపూర్ శివారులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఘటనా స్థలానికి నిజామాబాద్ సీపీ సాయి చైతన్యతో పాటు ఏసీపీ రాజా వెంకటరెడ్డి, నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్ఐ తిరుపతి చేరుకుని పరిశీలించారు. మృతదేహం నగ్నంగా, తల లేకుండా కుడి చేయి మణికట్టు తొలగించి ఉంది. సీపీ సాయిచైతన్య పది స్పెషల్ టీంలను రంగంలోకి దించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారంగా ఆధారాలు సేకరించారు. మండలంలో వరుస హత్యలు చోటు చేసుకుంటుండడంతో మండల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

## పథకాలు రద్దు చేస్తానని సీఎం ధమ్కీలు ఇస్తున్నాడు

- 500 రోజుల్లో అధికారంలోకి బీఆర్ఎస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఎన్టీఆర్ హిల్స్‌లో భారీ స్టేడియం కట్టి దానికి మాగంటి గోపీనాథ్ పేరు పెడతామని, ఆయన చేసిన సేవలకు ఇది సరైన గౌరవం అవుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్ రహమతనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన శుక్రవారం భారీ రోడ్ షో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూబ్లీహిల్స్ ప్రజలంటే మాగంటి గోపీనాథ్‌కు ఎంతో అభిమానం ఉందని, ఆయన ప్రజల కోసం చేసిన సేవలకు గుర్తుగా జూబ్లీహిల్స్ ప్రజలు మరోసారి ఆ అభిమానం చాటాలని కోరారు. 2023లో జూబ్లీహిల్స్‌లో అత్యధిక మెజార్టీ ఇచ్చింది రహమత్‌నగరమేనని, ఈసారి 12 వేల మెజార్టీతో గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు. భర్త చనిపోయి కన్నీళ్లు పెట్టుకుంటున్న మాగంటి సునీతమ్మను విమర్శించడం అరాచకం అన్నారు. ఒక్క ఆడబిడ్డను ఓడించేందుకు రేవంత్‌రెడ్డి కాలికి బలపం కట్టుకున్నాడని అన్నారు. రెండేండ్ల పాలనలో కాంగ్రెస్ ఒక మంచి పనిచేసిందా అని ప్రశ్నించారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఎంత అభివద్ధి జరిగిందో ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. జూబ్లీహిల్స్ ప్రజలు పెట్టే వాతలతోనే రేవంత్‌రెడ్డికి బుద్ధి వస్తుందని, మహామహులకు బుద్ధి చెప్పిన ఘనత తెలంగాణ గడ్డదే అన్నారు.

పథకాలు రద్దు చేస్తానని రేవంత్‌రెడ్డి బెదిరిస్తున్నాడని, అసలేం పథకం ప్రారంభించావ్ రేవంత్ రెడ్డి?" అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ధమ్కీలు ఇస్తున్నాడని, ఈ బెదిరింపులు ప్రజాస్వామ్యానికి తగవని, ఈ రీతిలో మాట్లాడటం అహంకారానికి నిదర్శనమన్నారు. ఇలాగే ఎగిరెగిరి పడితే ప్రజలు పెట్టే వాతలకు నీ ప్రభుత్వమే ఆగమవుతుందని హెచ్చరించారు. కేవలం ఐదేండ్ల కోసమే ప్రజలు రేవంత్ రెడ్డిని గెలిపించారని, సరిగ్గా పాలించకపోతే బుద్ధి చెప్పి ఇంటికి పంపిస్తారన్నారు. ఇక 500 రోజులు మాత్రమే నీకు సమయం ఉందని, ఆ తర్వాత బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని, కేసీఆర్ తిరిగి సీఎం అవుతారని ధీమా వ్యక్తం చేశారు.

## అంతర్జాతీయ సంక్షోభాలపై ముందుగా స్పందించే దేశం భారత్

- ప్రధాని మోడీ



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో భారత్ అందరికంటే ముందుగా స్పందించే దేశం అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు భారత్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. శనివారం ఛత్తీస్‌గఢ్ రాజధాని నవ రాయ్‌పుర్‌లో బ్రహ్మకుమారీల కొత్త భవనాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన ప్రసంగించారు. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశ పురోగతి సాధ్యమని మోదీ అన్నారు. 'వికసిత్ భారత్' లక్ష్య సాధనలో బ్రహ్మకుమారీల పాత్ర ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. బ్రహ్మకుమారీ గురువులు జానకీ దీదీ, రాజయోగిని దాది హృదయమోహిని తన జీవితంలో ప్రత్యేకమైన వ్యక్తులని చెప్పారు.

"బ్రహ్మకుమారీలతో నాకు అనుబంధం చాలా కాలంగా ఉంది. నేను అతిథిని కాదు, మీలో ఒకడిని. మీరు తక్కువ మాట్లాడుతూ ఎక్కువ సేవ చేస్తారు. ప్రతి జీవిలో శివుడిని చూసే మన సంప్రదాయం, ప్రపంచ శాంతిని కోరే మన సంస్కృతి అత్యంత గొప్పది." అని ప్రదాని అన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లోని నూతన అసెంబ్లీ భవనాన్ని రూ.324 కోట్లతో నిర్మించి ప్రధాని మోదీ శనివారం ప్రారంభించారు. అలాగే మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా

మిగితా 4వ పేజీలో

## పన్ను వసూళ్లు రికార్డు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశంలో వస్తు సేవల పన్ను (జీఎస్టీ) శ్లాబులను కుదించినప్పటికీ పన్ను వసూళ్లు రికార్డ్ స్థాయిలోనే నమోదయ్యాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో 4.6 శాతం వృద్ధితో రూ.1.96 లక్షల కోట్ల పన్ను వసూళ్లు జరిగాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం వెల్లడించింది. 2024 ఇదే నెలలో రూ.1.87 లక్షల కోట్లు వసూళ్లు కాగా.. అది ఈ ఏడాది పెరుగుదలను నమోదు చేయడం గమనార్హం. ఈ ఏడాది ఆగస్టులో రూ.1.86 లక్షల కోట్లు, సెప్టెంబర్‌లో రూ.1.89 లక్షల కోట్ల చొప్పున రాబడి నమోదైంది. గడిచిన నెలలతో పోల్చి చూసినప్పుడు సగటున 9 శాతం పెరుగుదల చోటు చేసుకోవడం విశేషం.

తెలంగాణలో గడిచిన నెలలో జీఎస్టీ వసూళ్లు 10 శాతం పెరిగి రూ.5,726 కోట్లకు చేరాయి. ఇక్కడ 2024 ఇదే నెలలో రూ.5,211 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. దేశవ్యాప్తంగా జీఎస్టీ పన్ను వసూళ్లు పెరుగుదలను నమోదు చేయగా.. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం భిన్నమైన గణంకాలు నెలకొనడం గమనార్హం. ఈ ఏడాది అక్టోబర్‌లో ఏపీలో జీఎస్టీ వసూళ్లు 9 శాతం తగ్గి రూ.3,490 కోట్లకు పరిమితమయ్యాయి. గతేడాది ఇదే నెలలో రాష్ట్రంలో రూ.3,815 కోట్ల పన్ను వసూళ్లు జరిగాయి. 2024 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు తెలంగాణకు కేంద్రం రూ.26,306 కోట్ల జీఎస్టీ వాటా చెల్లించింది. 2025 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు చెల్లించిన మొత్తం రూ.26,334 కోట్లుగా ఉన్నది. అంటే కేంద్రం చెల్లింపులు మూడు శాతం పెరిగాయి. ఇక ఏపీకి కేంద్రం చెల్లించిన జీఎస్టీ వాటా రూ.19,171 కోట్ల నుంచి రూ.19,696కి పెరిగింది. మూడు శాతం పెరుగుదల నమోదైంది.

కిచెన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సహా మొత్తం 375 రకాల ఉత్పత్తులను జీఎస్టీ తక్కువ రేటు శ్లాబులోకి మార్చిన విషయం తెలిసిందే. గతంలో 5, 12, 18, 28 శ్లాబులుగా ఉన్న జీఎస్టీ రేట్లను ఈ ఏడాది సెప్టెంబర్ 22 నుంచి 5 శాతం, 12 శాతాలకు పరిమితం చేశారు. దసరా నవరాత్రుల ప్రారంభం నుంచి ఈ కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. జీఎస్టీ రేట్లను తగ్గిస్తామని ఆగస్టు 15న ప్రధాని మోడీ ప్రకటించగా.. అనేక మంది వినియోగదారులు తమ కొనుగోళ్లను వాయిదా వేసుకోవడంతో అక్టోబర్‌లో భారీగా విక్రయాలు జరిగాయని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

మిగితా 4వ పేజీలో

## కార్పొరేషన్ల పునరుద్ధరణపై కార్యాచరణ వేగవంతం

- వ్యవసాయ శాఖ పరిధిలోని కార్పొరేషన్లపై మంత్రి సమీక్ష

వివరాల 2వ పేజీలో

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో మైనింగ్ క్వారీ లీజులకు కీలక ముందడుగు..

- **జిల్లా సర్వే నివేదికపై ప్రజాభిప్రాయ సేకరణ**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చిన్న తరహా ఖనిజాల మైనింగ్ మరియు క్వారీ లీజుల మంజూరు, రెన్యువల్ ప్రక్రియలో కీలకమైన అడుగు పడింది. రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు సంస్థ పర్యావరణ అనుమతులు జారీ చేయడానికి అత్యంత అవసరమైన 'జిల్లా సర్వే నివేదిక' ను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కోసం పొందుపరిచారు.

కొత్తగా క్వారీ లీజులు మంజూరు చేయడానికి లేదా ప్రస్తుతం నడుస్తున్న లీజులను రెన్యువల్ చేయడానికి పర్యావరణ అనుమతి తప్పనిసరి. %బాజుక్ష్మ్రాూబా% ఈ అనుమతులు మంజూరు చేయడానికి ఈ జిల్లా సర్వే నివేదిక ఒక కర దీపికగా మరియు రిఫరెన్స్ డాక్యుమెంట్‌గా ఉపయోగపడుతుంది. ఈ నివేదికను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ మరియు సుప్రీం కోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు రూపొందించారు. ఈ నివేదికలో జిల్లాలోని ఖనిజ వనరులు, క్వారీ లీజుల వివరాలు, భౌగోళిక స్వరూపం, వాతావరణం, శీతోష్ణస్థితి, వర్షపాతం, వాగులు, వంకలు, అడవులకు సంబంధించిన సమగ్ర సమాచారం ఉంది.

జిల్లాలోని ప్రజలకు సమాచారార్థం, ఈ నివేదికపై వారి సలహాలు మరియు అభ్యంతరాల స్వీకరణకు జిల్లా పోర్టల్‌లో ఉంచడం జరిగింది. ఈ నివేదికపై తమ అభిప్రాయాలను వెల్లడించాలనుకునే వారు, ఈ సమాచారం ప్రచురించిన తేదీ నుండి 21 రోజుల్లోగా తెలియజేయవచ్చు. ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం, అంతిమ జిల్లా సర్వే నివేదిక SEIAA కి సమర్పించడం జరుగుతుంది.

# తల్వార్లతో హల్‌చల్.. ముగ్గురు వ్యక్తులపై కేసు

- **సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ**



**బలగం టీవీ, సిరిసిల్ల:**

సిరిసిల్ల పట్టణంలో శాంతి భద్రతలకు విఘాతం కల్గించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన ముగ్గురు వ్యక్తులపై పట్టణ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి, వారిని రిమాండ్‌కు తరలించినట్లు సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ వెల్లడించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల పట్టణ ఇన్స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ.. పట్టణంలోని సుందరయ్య నగర్, సిక్కువాడకు చెందిన ముగ్గురు వ్యక్తులు – బుర్హాని నరసింగ్ ఏ బుర్హాని నరసింహ సింగ్ (39 సం), రాజేష్ సింగ్ (32 సం), బురాని గోపాల్ సింగ్ (51 సం) లు తల్వార్లతో (పెద్ద కత్తులతో) రోడ్డు మీదికి వచ్చి భయంకరంగా అరుస్తూ, వారిలో వారు ఒకరిపై ఒకరు దాడి చేసుకుంటూ చుట్టూపక్కల ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. ఈ ఘటన ప్రజా శాంతికి తీవ్ర భంగం కల్గించింది. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే స్పందించి, ఆ ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి మూడు తల్వార్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రజా శాంతికి భంగం కల్గించినందుకుగాను వారిపై కేసు నమోదు చేసి, ఈ రోజు రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. శాంతి భద్రతలకు భంగం కలిగిస్తూ, ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.



# రైతులకు న్యాయం చేయండి..

- **తడిసిన ధాన్యం, నల్లబడిన పత్తి మార్కెట్ ధరకే కొనుగోలు చేయాలి**
- **సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులకు తక్షణమే ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ముశం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లాల వద్ద ఉన్న ధాన్యం మరియు పత్తి తడిసి తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో, తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా, నల్లగా మారిన పత్తిని 'ఏ వన్ గ్రేడ్' కింద మార్కెట్ ధరకే కొనుగోలు చేయాలని ఆయన కోరారు. అమృత లాల్ శుక్ల కార్మిక భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ముశం రమేష్ మాట్లాడుతూ.. నాలుగు నెలలు కష్టపడి పండించిన పంట నీట మునగడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్లాల వద్ద ఉన్న ధాన్యం వరదల్లో కొట్టుకుపోగా, పత్తి తడిసి నల్లగా మారిందని తెలిపారు. నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం వెంటనే స్పందించి ఎకరానికి రూ. 50 వేలు పరిహారం చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు విధించకుండా మొత్తం కొనుగోలు చేయాలని, నల్లగా మారిన పత్తిని 'ఏ వన్ గ్రేడ్' కింద మార్కెట్ రేటుకే కొనుగోలు చేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు నష్టపోయినప్పుడు హామీలకే పరిమితమై, కొంత మొత్తాన్ని ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నాయని సిపిఎం జిల్లా కార్యదర్శి మండిపడ్డారు. లక్షల్లో నష్టం జరిగితే నామమాత్రపు పరిహారం సరిపోదని స్పష్టం చేశారు. అధికారులు జిల్లా అంతటా పర్యటించి, వాస్తవంగా ఎంత నష్టం జరిగిందో నిర్ధారించి, ఆ లెక్కన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల బెడద దృష్ట్యా, కల్లాల వద్ద ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం కూడా వెంటనే స్పందించి రాష్ట్రంలో జరిగిన నష్టానికి నిధులు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ముశం రమేష్ కోరారు. లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం సభ్యులు ఎగవంటి ఎల్లారెడ్డి కోడలు, రమణ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు, గురజాల శ్రీధర్, సూరం పద్మ, శ్రీరాముల రమేష్ చంద్ర, సిపిఎం నాయకులు గుండేటి కనకయ్య, సందుపట్ల పోచమల్లులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ల పునరుద్ధరణపై కార్యాచరణ వేగవంతం

- **అప్పులు ఆస్తుల వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలి**
- **అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశం**
- **వ్యవసాయ శాఖ పరిధిలోని కార్పొరేషన్లపై మంత్రి సమీక్ష**

**బలగం టీవీ, హైదరాబాద్**



వ్యవసాయ శాఖ పరిధిలోని అనుబంధ కార్పొరేషన్ల స్థితిగతులపై వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. శాఖ అనుబంధ విభాగాల ఉన్నతాధికారులతో కలిసి కార్పొరేషన్ల పనితీరు, ఆర్థిక స్థితిగతులపై చర్చించారు.

మంత్రివర్యులు మాట్లాడుతూ ఏర్పాటైన కాలంలో రైతులకు అనేక సేవలు అందించిన కార్పొరేషన్లు, కాలక్రమేణా పరిపాలనా మార్పులతో కొన్నివి నిరర్థకంగా మారిపోయాయని పేర్కొన్నారు. కొన్ని కార్పొరేషన్లు అధిక పని భారం మోయగా, మరికొన్ని పూర్తిగా నిర్వీర్యం కావడం వల్ల ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపులకే కష్టాలు తలెత్తాయని తెలిపారు.

ఒకే విధమైన పనులను మూడు, నాలుగు కార్పొరేషన్లు నిర్వహించడం, సంబంధం లేని కార్యక్రమాల్లో పాలుపంచుకోవడం వంటి సమస్యలను మంత్రి గమనించారు. వాటిని సరిదిద్దే దిశగా తొలి సంవత్సరంనుండే చర్యలు ప్రారంభించామని గుర్తుచేశారు. ఈ సమీక్షలో కార్పొరేషన్ల పని విధానం, పరిధి దాటి ఉన్న బాధ్యతలు, ఆర్థిక పరిస్థితి – అప్పులు, ఆస్తుల వివరాలను పరిశీలించాలని ఆదేశించారు. సమగ్ర నివేదికను తక్షణమే ప్రభుత్వానికి సమర్పించాలన్నారు.

"వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్లు రైతాంగానికి సేవలు అందించేలా సమర్థవంతంగా పనిచేయాలి. నిరర్థకంగా మారిన అగ్రోస్‌ను పునరుద్ధరించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలి" అని తెలిపారు. అన్ని కార్పొరేషన్లు సమర్థవంతంగా పనిచేసేలా పటిష్టమైన ప్రణాళిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ డైరెక్టర్ గోపి , ఆయిల్‌ఫెడ్ ఎం.డి. యాస్మిన్ బాషా , మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీభాయి, అగ్రోస్ ఎం.డి. శ్రీ రాములు, తదితర అధికారులు పాల్గొన్నారు.

**అగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ కార్యాలయంలో మంత్రి ఆకస్మిక తనిఖీలు**

**సకాలంలో విధులకు రాని సిబ్బందిపై ఆగ్రహం**

**సమయపాలన తప్పనిసరి అని హెచ్చరిక**

తెలంగాణ రాష్ట్ర అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీ సమయంలో పలువురు ఉద్యోగులు విధులకు సకాలంలో హాజరుకాలేదని గమనించిన మంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. "మీ ఇష్టం వచ్చినప్పుడు డ్యూటీకి వస్తారా? విధి నిర్వహణ వేళలు పాటించరా?" అంటూ ఆలస్యంగా వచ్చిన సిబ్బందిపై మండిపడ్డారు.

కార్యాలయంలో హాజరు నమోదు కోసం అమలు చేస్తున్న బయోమెట్రిక్ సిస్టమ్ను మంత్రి పరిశీలించారు. ప్రస్తుతం ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్ ద్వారా హాజరు తీసుకుంటున్నారా, లేక ఫింగర్ ప్రింట్ విధానమా అనే అంశాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ సందర్భంగా భవనాల నిర్వహణ సరిగా లేకపోవడంపైనా మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయ భవనం శిథిలావస్థలో ఉండడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తూ, వెంటనే మరమ్మత్తు పనులు చేపట్టాలని ఆదేశించారు.

తాజాగా మంత్రి తుమ్మల తన శాఖ పరిధిలోని మార్కెటింగ్ మరియు వ్యవసాయ శాఖ కార్యాలయాలను కూడా ఆకస్మికంగా పరిశీలించిన విషయం తెలిసిందే. ఆలస్యంగా విధులకు హాజరైన ఉద్యోగులకు మెమోలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# రాజకీయ పార్టీలన్నీ చిత్తశుద్ధితో సహకరించాలి

**రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య**

**బలగం టీవీ, హైదరాబాద్**



స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు రాజకీయ పార్టీలన్నీ చిత్తశుద్ధితో సహకరించాలని రాజ్యసభ సభ్యులు, రాష్ట్ర బీసీ జేఏసీ చైర్మన్ ఆర్.కృష్ణయ్య కోరారు.టీజీ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో పలు బీసీ కుల సంఘాల అధ్యక్షులతో సమా వేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీసీ జేఏసీ కన్వీనర్, తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం అధ్యక్షులు డా.గటిక విజయ్ కుమార్ తో కలిసి ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల బీసీ రిజర్వేషన్ల అమలుకై నిర్వహించిన బీసీ రాష్ట్ర బంద్ కు అన్ని రాజకీయ పార్టీలు బేషరతుగా మద్దతు ఇచ్చాయని గుర్తు చేశారు.గత 76 ఏండ్లుగా పార్టీలు, ప్రభుత్వాలు బీసీలను నిర్లక్ష్యం చేశాయని, ఇక మీదట బీసీలకు న్యాయబద్ధమైన వాటా ఇవ్వడానికి ప్రభుత్వాలు ముందుకు రావాలని కోరారు.రాజకీయాలు, పార్టీలకతీతంగా అన్ని కుల సంఘాలు, బీసీ సంఘాలు ఐక్యమత్యంతో ముందుకు వచ్చి బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేయాలని సూచించారు.బీసీ జేఏసీని బలోపేతం చేయడంలో అన్ని బీసీ కుల సంఘాలు, ప్రజా సంఘాల అధ్యక్షులను జేఏసీలో కన్వీనర్లుగా నియమించడం జరిగిందన్నారు.రాబోయే రోజుల్లో అన్ని జిల్లాలు, నియోజకవర్గాల్లో బీసీ జేఏసీని ఏర్పాటు చేయాలని సూచించారు.అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చినప్పుడు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడంలో అభ్యంతరం ఏంటని ఆయన ప్రశ్నించారు.రాజకీయ రిజర్వేషన్లకు మెరిట్ ఉండదన్నారు.చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు ప్రవేశపెట్టేంత వరకు తమ పోరాటం ఆగదన్నారు.రాబోయే రోజుల్లో బీసీ రిజర్వేషన్లపై తెలంగాణ ఉద్యమం మాదిరిగా బీసీ ఉద్యమం చేపట్టనున్నట్లు ప్రభుత్వాలను హెచ్చరించారు.అందుకు అన్ని బీసీ కుల సంఘాల నాయకుల పాత్ర, మద్దతు ఉండాలని, ఈ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని వారికి సూచించారు.ఈ సమావేశంలో రాష్ట్ర మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు చొప్పరి శంకర్ ముదిరాజ్, ఆరెకటిక సంఘం అధ్యక్షులు సురేందర్, దాసరి సంఘం ప్రధాన కార్యదర్శి కె.శివకృష్ణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం, పలు బీసీ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# డాక్టర్ జనపాలకు ఈసీ మెంబర్ జ్ఞానోబాకు సత్కారం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ నుండి రాష్ట్ర కార్యవర్గానికి డాక్టర్ జనపాల శంకరయ్య రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, రామరాజు కార్యదర్శిగా, అంకారపు జ్ఞానోబా ఈసీ మెంబర్‌గా ఎన్నిక కావడం హర్షణీయమని జిల్లా అధ్యక్షుడు చేపూరి బుచ్చయ్య అన్నారు. 01.11.2025 తేదీన చేపూరి బుచ్చయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ఈ విషయాన్ని తెలియజేశారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన డాక్టర్ జనపాల శంకరయ్య రాష్ట్ర కార్యవర్గానికి ఉపాధ్యక్షులుగా ఎన్నిక కావడం గొప్ప పరిణామమని బుచ్చయ్య కొనియాడారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ, వయోవృద్ధుల కోసం త్వరలో డే కేర్ సెంటర్ ప్రారంభిస్తామని తెలిపారు. అంతేకాకుండా, దరఖాస్తు చేసుకున్న వారికి నడవడానికి ఆసరా ఇచ్చే స్టిక్కులను, వినికిడి లోపం ఉన్నవారికి ఉపయోగపడే చెవిలో పెట్టుకునే మిషన్లను అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన ప్రకటించారు. ముఖ్య సలహాదారు కూడా నారాయణ మాట్లాడుతూ, జనపాల శంకరయ్య అన్ని రంగాల్లో రాణించిన వ్యక్తి, మంచి సౌమ్యుడని ప్రశంసించారు. ఉపాధ్యక్షులు ఎనుగుల ఎల్లయ్య మరియు శ్రీగాద మైసయ్య కూడా శంకరయ్య ఎన్నిక పట్ల హర్షం వ్యక్తం చేశారు, ఆయన మాట తీరు మెప్పించే విధానంలో ముందు వరుసలో ఉంటారని మైసయ్య గారు పేర్కొన్నారు.



సన్మానం అనంతరం డాక్టర్ జనపాల శంకరయ్య మాట్లాడుతూ, తనకు సహకరించిన సభ్యులందరికీ నమస్కారాలు తెలుపుతూ, రాష్ట్ర కార్యవర్గం ఎన్నికకు తనను రాష్ట్ర శాఖ ఎలక్షన్ అధికారిగా నియమించిందని, అందుకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేస్తామని తెలిపారు. మానవ సేవే మాధవ సేవగా నడుచుకుంటూ వయోవృద్ధుల సేవలో ముందుంటానని, అలాంటి స్వభావం ఉన్నవాళ్లే కార్యవర్గ సభ్యులుగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం అనంతరం, నూతనంగా ఎన్నికైన డాక్టర్ జనపాల శంకరయ్య మరియు అంకారపు జ్ఞానోబా లకు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్జల్లి రామచంద్రం, బెజవాడ కైలాసం తదితరులతో సహా సుమారు 30 మంది సీనియర్ సిటిజన్లు పాల్గొన్నారు.

# ప్రభుత్వ దవాఖానల్లో వసతులపై అవగాహన కల్పించాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, వేములవాడ**

ప్రభుత్వ దవాఖానల్లో అందుతున్న సేవలు, వసతులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు. శనివారం వేములవాడ మండలం హన్మాజీపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇంచార్జి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీ హెచ్ సీ లో సిబ్బంది హాజరు, ఓపీ, మందుల రిజిస్టర్, వ్యాక్సిన్ గది, మందులు ఇచ్చే గదిని పరిశీలించారు. దవాఖానలో అందుతున్న వైద్య సేవలపై రోగుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గర్భిణీలు అందరూ ప్రభుత్వ దవాఖానల్లో పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని, నిరంతరం పరీక్షలు చేసి వైద్యం అందించాలని, సర్కార్ దవాఖానల్లోనే ప్రసవాలు చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి, సీజనల్ వ్యాధులు తదితర అంశాలపై అవగాహన కల్పించాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై ఆసుపత్రికి వచ్చే వారికి వివరించాలని అన్నారు.

**మెనూ ప్రకారం భోజనం అందించాలి..**

వేములవాడ మండలం హన్మాజీపేటలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, సిబ్బంది రిజిస్టర్లు తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యా బోధనను పరిశీలించారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం విద్యార్థులకు అందించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.

# తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలి..

- **ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

తుఫాన్ నష్టంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. శనివారం ఇటీవల తుఫాన్ తో జిల్లాలో జరిగిన నష్టం అంచనాలు రూపొందించడంపై వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఇటీవల తుఫాన్ కారణంగా పాక్షికంగా, పూర్తిగా నష్టపోయిన ఇండ్ల వివరాలను రెవెన్యూ అధికారులు, పంట నష్టంపై వ్యవసాయ శాఖ అధికారులు, రోడ్లు, బ్రిడ్జిలు, కల్వర్టులు నష్టంపై ఆర్అండ్ బీ, పీఆర్ అధికారులు, స్కూల్స్, అంగన్వాడి కేంద్రాలు, రెసిడెన్షియల్ హాస్టళ్ల, ప్రభుత్వ శాఖల భవనాల్లో లీకేజీలపై డీఈఓ, డీడబ్ల్యూఓ, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల లీకేజీలు, మరమ్మత్తుపై నీటి పారుదల శాఖ అధికారులు, విద్యుత్ స్తంభాలు, సబ్ స్టేషన్లలో నష్టం అంచనాలు సెస్




అధికారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పూర్తి నివేదికను మంగళవారంలోగా అందజేయాలని ఇంచార్జి కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశం లో అదనపు కలెక్టర్ రెవెన్యూ గడ్డం నగేష్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, ఈఈ ఆర్అండ్ బీ నరసింహాచారి, డీఏఓ అఫ్జల్ బేగం, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి కిషోర్ కుమార్, సెస్ ఎండీ భిక్షపతి పాల్గొన్నారు.

# వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో

## 14 నెలల్లో 1200 డెలివరీలు

- **వీటిలో సహజ కాన్పులు 349**
- **ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి అభినందనలు**
- **వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య**

**బలగం టీవీ, వేములవాడ**

వేములవాడ ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలలో ఉత్తమ వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, సిబ్బందిని సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ పెంచలయ్య మాట్లాడారు. దవాఖానలో గత నెల అక్టోబర్లో 105 కాన్పులు జరిగాయని, గత ఏడాది ఆగస్టు నుంచి ఇప్పటివరకు 1200 కాన్పులు జరగగా, అందులో 349 సాధారణ కాన్పులు ఉన్నాయని వెల్లడించారు. గైనకాలజిస్ట్ డాక్టర్లు, మత్తు వైద్యులను, కాన్పుల వార్డు సిబ్బందిని, పిల్లల వైద్యులను సన్మానించి అభినందనలు తెలిపారు. వైద్యులు లేని సమయంలో గైనిక్ వైద్యులను కేటాయించి సహకరించిన జిల్లా కలెక్టర్ గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



ఆసుపత్రి అభివృద్ధికి సహకరిస్తున్న కమిటీ చైర్మన్ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్, ఆసుపత్రి కి అవసరం అయిన దాదాపు కోటి ఎనభై లక్షల రూపాయలు విలువ చేసే పరికరాలు అందజేసిన కేంద్ర మంత్రి శ్రీ బండి సంజయ్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. దవాఖానలో అందిస్తున్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య పిలుపు ఇచ్చారు.

# ఫుడ్ పాయిజన్ పాపం ప్రభుత్వానిదే..



- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రవి గౌడ్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలోని ధర్మవరం బీసీ హాస్టల్లో ఫుడ్ పాయిజన్ పాపం ప్రభుత్వనిదేనని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మండిపడ్డారు. ఈ ఘటనపై నిరసనగా శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చేనేత చౌక్ వద్ద కంచర్ల రవి గౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థులపై ప్రభుత్వ నిర్లక్ష్యం ఘోరమని కంచర్ల రవి గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 25 నెలలు గడిచినా విద్యార్థుల సంక్షేమంపై ఎలాంటి శ్రద్ధ చూపడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు నుండి 110 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. అయినప్పటికీ ప్రభుత్వం సమీక్షలు చేయకపోవడం సిగ్గుచేటు" అని ఆయన అన్నారు. హాస్టళ్లలో చదివే విద్యార్థులు ఎక్కువగా మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, వారి తల్లిదండ్రులు ఆశతో పంపిస్తే పిల్లల ప్రాణాలపై ఇలాంటి నిర్లక్ష్యం చూపడం దారుణమని ఆయన విమర్శించారు. హాస్టల్లలో జరుగుతున్న వ్యవస్థలపై విచారణ జరిపి, బాధ్యులైన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు శాపంగా మారిందని విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ప్రభుత్వాన్ని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. విద్యార్థులకు ఏ కష్టం వచ్చినా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్న విద్యార్థులకు అత్యుత్తమ వైద్య సేవలు అందించాలనీ, హాస్టల్ల పరిస్థితిని ముఖ్యమంత్రి స్వయంగా సమీక్షించాలని" రవి గౌడ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.కె. అప్రోచ్, హరీష్, సాయి, ఆదిత్య, రామ్, వరుణ్, జస్వంత్, అనీష్, సాయి తేజ, విష్ణు, రిశ్విత్, అభినయ్, విక్రం, సిద్ధార్థ శ్రీశేషం, లవన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు, విద్యార్థినీలు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా సంప్రదించండి..

- **సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దు..**
- **మహిళలను వేధిస్తున్న పోకిరీలపై గడిచిన 10 నెలలో 27 ఎఫ్ఐఆర్లు, 35 పెట్టి కేసులు నమోదు..**
- **మహిళలు,విద్యార్థినిలు వేధింపులకు గురైతే షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో చట్టపరమైన చర్యలు..**
- **జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఐపిఎస్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. జిల్లాలో షీ టీమ్ బృందం విద్యాసంస్థల్లో,మహిళలు పని చేసే ప్రదేశాల్లో ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ మహిళ చట్టలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. గడిచిన 10 నెలలో షీ టీమ్ కు వచ్చిన ఫిర్యాదులలో 27 ఎఫ్ఐఆర్లు,35 పెట్టి కేసులు నమోదు చేసి మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న వారిని గుర్తించి వారియొక్క తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగింది.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ.. విద్యార్థినులు, మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని, జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు, విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని, ముఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయమ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం వుండాలని సూచించారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని, మరేక్కడ్కెన ల్కెంగిక వేధింపులకు గురౌవుతున్న, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు, విద్యార్థునులు, బాలికలు మౌనంగా ఉండకుండా, ధ్కెర్యంగా పిర్యాదు చేయాలని సూచించారు. ఎవరైనా ఆకతయులు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యాసంస్థలల్లో ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు, పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనేజిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని ఎస్పీ తెలిపారు.

# అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి..

- **కార్మికుల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు దర్శనం కిషన్**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**



తెలంగాణ వ్యాప్తంగా ప్రకృతి వైపరీత్యాల కారణంగా మొంథా తుపానుతో వర్షాల నేపథ్యంలో నష్ట పోయిన రైతు కుటుంబ లను ప్రభుత్వం ఆదుకోవాలని కార్మికుల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు దర్శనం కిషన్ కోరారు. మొంథా తుపాను కారణంగా వరి రైతులు పత్తి మొక్క జొన్న రైతులు విపరీతంగా నష్టపోయారని ఇలాంటి విపత్కర పరిస్థితికి కారణం గుట్టల విధ్వంసం అడవుల నరికివేత పర్యావరణ విధ్వంసమన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ ప్రకృతి సంపదను అదాని, అంబానీ బహుళజాతి కంపెనీల కు తాకట్టు పెట్టారు. కావున ఇప్పటికైనా అడవులు గుట్టల విధ్వంసం నుండి కాపాడుకోవాలన్నారు. నష్ట పోయిన రైతు లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలి తుపాను కారణంగా తడిసిన వడ్లను ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని,నష్ట పోయిన రైతు లకు నష్ట పరిహారం ఎకరానికి 50వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దర్శనం కిషన్ కార్మిక హక్కుల పోరాట సంఘం రాష్ట్ర నాయకులు ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్, బలవ్వ విజయ్, బాలయ్య, రవి రాజు పాల్గొన్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లా పద్మశాలి సంఘం అభినందన సభ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



రాజన్న సిరిసిల్ల జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు గాజుల బాలయ్య పద్మశాలి అధ్యక్షతన జిల్లా కేంద్రంలో సాధారణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో జిల్లా సంఘం నుండి గౌరవ పదవులు పొందిన ప్రముఖులను, ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన మండల అధ్యక్షుడిని సంఘం తరఫున ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా, తమ జిల్లా కమిటీ సభ్యులు అవధూత రజనీకాంత్ పద్మశాలి పబ్లిక్ ప్రాసిక్యూటర్గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఆయన నియామకం పద్మశాలి సంఘానికి గర్వకారణమని జిల్లా అధ్యక్షులు గాజుల బాలయ్య పద్మశాలి పేర్కొన్నారు.

అదేవిధంగా, బోయినపల్లి మండలం పద్మశాలి సంఘ అధ్యక్షులుగా జక్కని లక్ష్మీనారాయణ పద్మశాలి ఏకగ్రీవంగా ఎన్నికైనందున, ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానం చేశారు. నూతన కార్యవర్గం సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా, జిల్లా అధ్యక్షులు గాజుల బాలయ్య పద్మశాలి ప్రధానకార్యదర్శి, దిడ్డి రాజు పద్మశాలి మరియు గౌరవ కమిటీ సభ్యులు కలిసి శాలువాలు, పూలమాలలు, జ్ఞాపికలు అందించి అవధూత రజనీకాంత్ పద్మశాలి ని మరియు జక్కని లక్ష్మీనారాయణ పద్మశాలి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కమిటీ సభ్యులు మరియు మండలాల పద్మశాలి నాయకులు హాజరై, సన్మానం అందుకున్న ప్రముఖులకు అభినందనలు తెలిపారు.

# భారత్ చరిత్ర సృష్టించేనా...?

- **నేడు వరల్డ్ కప్ ఫైనల్‌లో సౌతాఫ్రికాతో భారత్ పోరు**

**బలగం టీవీ, హైదరాబాద్**




ఒక్క అడుగు దూరంలోనే చరిత్ర ఉంది! దశాబ్దాలుగా నెరవేరని కలను సాకారం చేసేందుకు భారత మహిళల జట్టు సిద్ధమైంది. ఆదివారం నవి ముంబయిలోని డివై పాటిల్ స్టేడియంలో సౌతాఫ్రికాతో జరిగే వరల్డ్ కప్ ఫైనల్‌లో హర్మన్ ప్రీత్ కౌర్ సేన బరిలో దిగనుం ది. చరిత్రను సృష్టించేందుకు భారత జట్టు ఉత్సాహంతో ఉంది. అయితే ప్రత్యర్థి కూడా బలమైన జట్టే కావడంతో భారత్ సుశ్రద్ధగా వ్యూహరచనతో ఫీల్డ్‌లోకి దిగాల్సిన పరిస్థితి ఉంది.

ఇప్పటికే లీగ్‌స్టేజ్‌లో సౌతాఫ్రికాతో జరిగిన పోరులో భారత్ ఓటమి చవిచూసింది. విశాఖపట్నం వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో చిన్న తప్పిదాల కారణంగా సఫారీలు విజయాన్ని దక్కించుకున్నారు. భారత్ 251 పరుగులు చేసినప్పటికీ, సౌతాఫ్రికా 48.5 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆ ఓటమికి ప్రతీకారంగా ఈసారి ఫైనల్‌లో సౌతాఫ్రికాపై ఘాటైన దెబ్బతో చరిత్ర సృష్టించాలనే దృఢనిశ్చయంతో టీమ్ ఇండియా సిద్ధమవుతోంది.

సెమీఫైనల్‌లో ఆస్ట్రేలియాపై అద్భుత విజయాన్ని సాధించిన భారత జట్టు బౌలింగ్ విభాగంలో స్వల్ప మార్పులు చేసుకునే అవకాశం ఉంది. రాధా యాదవ్ స్థానంలో స్నేహ్ రానా జట్టులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. సెమీస్‌లో రాధా 8 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే తీసి 66 పరుగులు ఇచ్చింది. లీగ్ మ్యాచ్‌లో సౌతాఫ్రికాపై స్నేహ్ రానా మంచి ప్రదర్శన కనబరిచినందున ఆమెకు అవకాశం లభించే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి.

గాయంతో బయటకు వెళ్లిన ప్రతీకా రావల్ స్థానంలో వచ్చిన షఫాలీ వర్మ సెమీస్‌లో బరిలో దిగింది. పరుగులు రాకపోయినా ఆమె ఆడిన 5 బంతుల్లో 2 ఫోర్లు కొట్టి తన అగ్రెసివ్ స్వభావాన్ని చూపించింది. దీంతో ఆమెను ఓపెనర్‌గా కొనసాగించే అవకాశం ఉంది. స్మృతి మంధానతో కలిసి షఫాలీ ఇన్నింగ్స్ ప్రారంభించనుంది. వన్‌డౌన్‌లో జెమీమా రోడ్రిగ్స్, ఆ తర్వాత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఆడనున్నారు. మిడిల్ ఆర్డర్‌లో దీప్తి శర్మ, రిచా ఘోష్, అమన్‌జోత్ కౌర్ వంటి ఆటగాళ్లు బలంగా నిలుస్తారు.

**అంచనా జట్లు**

భారత్ (అంచనా): షఫాలీ వర్మ, స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), దీప్తి శర్మ, రిచా ఘోష్ (వికెట్ కీపర్), అమన్‌జోత్ కౌర్, క్రాంతి గాడ్, శ్రీ చరణి, రేణుక సింగ్, స్నేహ్ రానా/రాధా యాదవ్

సౌతాఫ్రికా (అంచనా): లారా వోల్వార్డ్ (కెప్టెన్), తజ్మిన్ బ్రిట్స్, సునే లూయిస్, అన్నరీ డెర్క్‌సెన్, అన్నెకే బాష్, మరిజానే కాప్, సినాలో జాఫ్తా (వికెట్ కీపర్), క్లో ట్రయాన్, నాదిన్ డి క్లెర్క్, అయాబొంగా ఖాకా, మ్లాబా

ఈ పోరు ఫలితంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. భారత్ చరిత్ర సృష్టిస్తుందా? లేక సౌతాఫ్రికా ఆతిథ్య జట్టును అడ్డుకుంటుందా? అనే ప్రశ్నకు సమాధానం ఆదివారం వెల్లడి కానుంది.

## అంతర్జాతీయ సంక్షోభాలపై ముందుగా స్పందించే దేశం భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఆయన మాట్లాడుతూ, దేశం మావోయిస్టు ఉగ్రవాదం, నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించే దిశగా అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలన్నీ అభివృద్ధి, వారసత్వ పరిరక్షణ అనే రెండు స్తంభాలపైనే నడుస్తున్నాయని తెలిపారు. "గత 25 ఏళ్లలో ఛత్తీస్‌గఢ్ చూసిన పరివర్తన అద్భుతం. ఒకప్పుడు నక్సల్ ప్రభావిత రాష్ట్రంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ నేడు శ్రేయస్సు, భద్రత, స్థిరత్వానికి చిహ్నంగా మారింది. ఈ మార్పు వెనుక ప్రజల కృషి, బీజేపీ ప్రభుత్వాల దార్శనిక నాయకత్వం ఉంది." అన్నారు.

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజధాని రాయ్‌పూర్‌లో పర్యటించిన ప్రధాని మోదీ, రూ.14,260 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. తరువాత హృదయ సంబంధిత వ్యాధులకు చికిత్స పొందిన 2,500 మంది చిన్నారులతో ఆయన మాట్లాడారు. "గిఫ్ట్ ఆఫ్ లైఫ్" కార్యక్రమం కింద శ్రీ సత్య సాయి సంజీవని ఆస్పత్రి చిన్నారులపై విజయవంతంగా శస్త్రచికిత్సలు నిర్వహించిందని పేర్కొన్నారు.

## రేపటి నుంచి ప్రయివేటు కాలేజీల నిరవధిక బంద్

(మొదటి పేజీ తరువాయి)


లా, ఎంబీఏ, ఎంసీఏ, బీబీఏ, డిగ్రీ, పీజీ, నర్సింగ్, పాలిటెక్నిక్, ఐటీఏ, బీఈడీ, ఎంఈడీ ప్రయివేటు కాలేజీలు సోమవారం నుంచి నిరవధిక బంద్ చేపట్టేందుకు నిర్ణయం తీసుకున్నామని వివరించారు. ఆదివారం వరకు కాలేజీలను ప్రభుత్వం ఆదుకోవాలనీ, ఫీజు బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బంద్‌తోపాటు అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్న పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. అన్ని కాలేజీలూ ఫీజుల కోసం ఎదురుచూస్తుంటే కొన్ని కాలేజీలకు ప్రభుత్వం ఫీజులను మంజూరు చేసిందన్నారు. పది శాతం లంచం తీసుకుని ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయనీ, విజిలెన్స్ విచారణలో దీన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఆర్థిక శాఖ కార్యదర్శిగా సీఎస్ ఉన్నపుడు నాలుగు కాలేజీలకే నిధులను విడుదల చేశారనీ, దానిపైనా విచారణ జరగాలని కోరారు. నిధుల దుర్వినియోగం ఎక్కడ జరుగుతుందో ప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. బంద్‌తోపాటు ఎమ్మెల్యేల ఇండ్లు, అధికారుల ఇండ్లతోపాటు కలెక్టరేట్లను ముట్టడిస్తామని చెప్పారు. ఈ బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అసౌకర్యం కలుగుతున్నందుకు విద్యార్థులు, తల్లిదండ్రులు తమ బాధను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఫతి వైస్ చైర్మెన్ అల్జాపూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఫీజులివ్వాలంటూ ప్రభుత్వ బాధ్యతను గుర్తు చేయాల్సి వస్తుందని అనుకోలేదన్నారు. సకాలంలో ఫీజు బకాయిలను విడుదల చేయకపోవడం వల్ల విద్యా ప్రమానాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పది వేల కోట్ల వరకు ఫీజు బకాయిలున్నాయని వివరించారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్ల డ్రాపౌట్లు పెరుగుతున్నారని అన్నారు. బ్లాక్‌మెయిల్ కోసమే విజిలెన్స్ తనిఖీలు చేపడుతున్నారని ఆరోపించారు. ఫీజులివ్వకుంటే భవిష్యత్తులో సామాజిక సమస్యగా మారుతుందన్నారు. టీపీడీఎంఏ అధ్యక్షులు బి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఫీజులిస్తామని హామీ ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం మాట తప్పిందని చెప్పారు. ఇప్పుడు విజిలెన్స్ తనిఖీలు చేపడతామంటూ బెదరించడం సమంజసం కాదన్నారు. కాలేజీల్లోని సిబ్బందికి జీతాలిచ్చే పరిస్థితి లేదనీ, యాజమాన్యాలకు అప్పు దొరకడం లేదని అన్నారు. ఫీజు బకాయిల్లో 50 శాతం ఇప్పుడు విడుదల చేయాలనీ, మిగిలిన వాటిని మార్చి నాటికి చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫతి కోశాధికారి కొడాలి కృష్ణారావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ కె సునీల్‌కుమార్, ప్రతినిధులు రేపాక ప్రదీప్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## "పెద్ది"లో రామ్ చరణ్ పక్కన అచ్చియమ్మగా జాన్వీ కపూర్

**బలగం టీవీ, హైదరాబాద్**

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చుట్టూ హైప్ మరింత పెరుగుతోంది. ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ జాన్వీ కపూర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు.పోస్టర్‌లో జాన్వీ కపూర్ "అచ్చియమ్మ" అనే గ్రామీణ యువతిగా నీలి చీరలో జీప్‌పై నిలబడి, చేతులు ఎత్తి నమస్కరిస్తున్న దృశ్యం ఆకట్టుకుంటోంది. ఆత్మవిశ్వాసం, మాస్ గ్రేస్ కలిసిన ఈ లుక్ అభిమానుల్లో విపరీతమైన స్పందన తెచ్చింది. మరో పోస్టర్‌లో ఆమె మైక్ ముందు నిలబడి ప్రచారం చేస్తున్నట్లుగా కనిపించింది.








## శర్వానంద్ బైక్ రేసర్‌గా కొత్త అవతారంలో

### 'బైకర్' ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ రిలీజ్

### "ప్రతి బైకర్‌కి ఓ కథ ఉంటుంది... చివరిదాకా పోరాడటమే నిజమైన గెలుపు"

**బలగం టీవీ, హైదరాబాద్**




హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న స్పోర్ట్స్ డ్రామా 'బైకర్' నుంచి మేకర్స్ శనివారం ఫస్ట్ ల్యాప్ గ్లింప్స్ విడుదల చేశారు. గ్లింప్స్ ప్రారంభం నుంచే బైకింగ్ స్పిరిట్‌తో నిండిపోయింది. "ఇక్కడ ప్రతి బైకర్‌కి ఓ కథ ఉంటుంది సమయంతో పోరాడే కథ చావుకు ఎదురెళ్లే కథ ఏం జరిగినా పట్టువదలని మొండోళ్ల కథ గెలవడం గొప్ప కాదు, చివరిదాకా పోరాడటం గొప్ప!" అంటూ వినిపించిన నేరేషన్ ప్రేక్షకులను ఆకట్టుకుంది. గ్లింప్స్‌లో శర్వానంద్ బైక్ రేసింగ్ స్టంట్స్, యాక్షన్ సీక్వెన్సెస్ విజువల్స్ థ్రిల్లింగ్‌గా ఉన్నాయి. తన పాత్ర కోసం హీరో చేసిన బాడీ ట్రాన్స్‌ఫర్మేషన్, ఫిజికల్ ఎఫర్ట్స్ స్పష్టంగా కనిపిస్తున్నాయి. సినిమా ప్రమోషన్‌లో భాగంగా ఈ గ్లింప్స్‌ను 'బాహుబలి: ది ఎపిక్', 'మాస్ జాతర' ప్రదర్శితమవుతున్న థియేటర్లలో చూపించనున్నారు. అలాగే సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లలో కూడా రిలీజ్ చేశారు.

1990%–%2000 దశకానికి చెందిన బైక్ రేసింగ్ నేపథ్యంతో, కుటుంబ అనుబంధాలు కలగలిసిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో శర్వానంద్ బైక్ రేసర్‌గా కనిపించబోతున్నారు. అభిలాష్ కంకర దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మాళవికా నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. వంశీ%–%ప్రమోద్ నిర్మాతలుగా, యూవీ క్రియేషన్స్ బ్యానర్‌పై విక్రమ్ సమర్పణలో రూపొందుతున్న ఈ చిత్రం షఉటింగ్ చివరి దశలో ఉంది. సినిమాటోగ్రఫీ జె. యువరాజ్, సంగీతం జిబ్రాన్ అందిస్తున్నారు.

**వరుస ప్రాజెక్టులతో శర్వానంద్ బిజీ**

'బైకర్' షఉటింగ్ పూర్తవుతుండగానే శర్వానంద్ మరో మూడు సినిమాల్లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. రామ్ అబ్బరాజు దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'నారీ నారీ నడుమ మురారి' సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. ఇందులో సాక్షి వైద్య, సంయుక్త హీరోయిన్లుగా నటిస్తున్నారు. అదనంగా సంపత్ నంది దర్శకత్వంలో 'భోగి', అలాగే శ్రీను వైట్లతో మరో కొత్త ప్రాజెక్ట్ కూడా ప్రారంభం కానుందని ఫిల్మ్ వర్గాలు తెలిపాయి.

## వరద నష్టం వివరాలు పంపండి

(మొదటి పేజీ తరువాయి)

రూపొందించుకోవాలని సీఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఆయా జిల్లాల్లో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు సీఎస్‌కు తెలిపారు. ఎక్కడైనా అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు ధ్వంసం అయితే వాటి పునరుద్ధరణకు వెంటనే నిధులు మంజూ రు చేస్తున్నట్టు వారికి సీఎస్ వివరించారు. తరచుగా ముంపుకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత చర్యలు చేపట్టాలనీ, అవసరమైన ప్రతిపా దనలు ప్రభుత్వానికి పంపాలని సూచించారు. పరిహారం అందిం చేందుకు వీలుగా నష్టం వివరాలను సోమవారం వరకు పంపించాల్సిందిగా కోరారు. ఎలాంటి అలసత్యం లేకుండా పునరావాస చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. టెలికాన్ఫరెన్స్‌లో విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మన సీట్లు మనకే...

(మొదటి పేజీ తరువాయి)

**మన విద్యార్థులకు దక్కనున్న 388 పీజీ సీట్లు...**

2025–26 విద్యా సంవత్సరానికి గాను తెలంగాణలో 31 పీజీ మెడికల్ కాలేజీలు 2983 సీట్లను అందిస్తున్నాయి, వీటిలో 12 ప్రభుత్వ (1472 సీట్లు), 19 ప్రైవేట్ కాలేజీలు (1511 సీట్లు) ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీలలో 50 శాతం సీట్లు ఆల్ ఇండియా కోటా కింద, 50శాతం సీట్లు స్టేట్ కోటా పరిధిలోకి వస్తాయి. ప్రైవేట్ కాలేజీలలో 50శాతం స్టేట్ కోటా పరిధిలోకి, మిగిలిన 50శాతం మేనేజ్‌మెంట్ కోటా కిందకు వస్తాయి. 741 పీజీ మెడికల్ మేనేజ్‌మెంట్ కోటా సీట్లలో 374 సీట్లు మేనేజ్ మెంట్ కోటా–1 (ఎంక్యూ–1) కు చెందినవి. ప్రభుత్వం సవరించిన కొత్త విధానం ప్రకారం 318 సీట్లు (85శాతం) ఇప్పుడు తెలంగాణ స్థానికత ఉన్న అభ్యర్థులకు రిజర్వ్ చేయబడతాయి. 56 సీట్లు (15శాతం) ఆల్ ఇండియా కోటా కింద భర్తీ చేస్తారు. అలాగే 70 డెంటల్ పీజీ సీట్లు కూడా మన విద్యార్థులకే దక్కుతాయి. మొత్తంగా పీజీ మెడికల్, పీజీ డెంటల్ కలిపి తెలంగాణ స్థానికత ఉన్న విద్యార్థులకు 388 సీట్లు అదనంగా లభించనున్నాయి.

**వైద్యరంగంలో కీలకమైన నిర్ణయమిది– వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ**

రాష్ట్ర వైద్య చరిత్రలో ఇది మర్చిపోలేని రోజుగా మిగిలిపోతుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ తెలిపారు. వైద్య విద్యార్థులు ఈ నిర్ణయం కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్నారని... ఎట్టకేలకు ఇది సాకారమైందన్నారు. ఈ నిర్ణయంతో మన రాష్ట్ర ప్రతిభావంతులైన యువ వైద్యులకు మరిన్ని అవకాశాలు లభిస్తాయన్నారు. రాష్ట్ర ఆరోగ్య రంగం మరింత బలపడుతుందన్నారు. విద్యార్థుల పక్షాన, తెలంగాణ పక్షాన ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## పన్ను వసూళ్లు రికార్డు

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ మొత్తం వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగం నుంచి రాగా.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు సమకూరాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. సెంట్రల్, స్టేట్, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ అన్నీ అక్టోబర్ నెలలో వృద్ధిని నమోదు చేశాయి. సెస్ వసూళ్లు మాత్రం తగ్గాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025–26 ఏప్రిల్ నుంచి అక్టోబర్ కాలంలో జీఎస్టీ వసూళ్లు 9 శాతం వృద్ధిని నమోదు చేశాయి. 2017లో జీఎస్టీని అమలు చేసినప్పటి నుంచి ఇదే అత్యధికం కావడం విశేషం.